క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు




మైలవరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకులు సరేందర్‌సింగ్ బాలి అన్నారు. మైలవరంలో ఎన్నికల అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులతో మాట్లాడారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు

ఇబ్రహీంపట్నం: పోలింగ్ నిర్వహణకు ఎన్నికల ప్రిసైండింగ్ అధికారులు, సహాయ ప్రిసైండింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఇతర సామగ్రితో వారికి కేటాయించిన బూత్‌లకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. మండలం పరిధి గ్రామాల్లో 34, కొండపల్లి మున్సిపాల్టీలో 54 మొత్తం 88 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేశారు. సీసీ కెమేరాలు, ఇతర సదుపాయాలు కల్పించారు.

ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం



విస్సన్నపేట: స్థానిక షిర్డీ సాయి సేవా మందిరం వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామి వారికి లక్ష మల్లెలతో అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేత
- ప్రత్యేక బస్సుల్లో తరలింపు
- సిబ్బందికి సూచనలు చేసిన అధికారులు



మైలవరం ఎల్‌హెచ్ స్టేడియంలో ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు వచ్చిన ఉద్యోగులు

మైలవరం/తిరువూరు/నూజివీడు: మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ఎన్నికల సామగ్రిని ఆదివారం ఎన్నికల అధికారులు అందజేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ప్రత్యేకంగా బస్‌లు ఏర్పాటు చేసి వారిని ఎన్నికల సామగ్రితో భద్రంగా గమ్యానికి చేరవేసేందుకు చర్యలు తీసుకున్నారు. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, విజయవాడ రూరల్ మండలాల్లోని గ్రామాల్లో మొత్తం 2,91,732 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 1,44,972 మంది, పురుషులు 1,36,740 మంది, ఇతరులు 20 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకుగాను నియోజకవర్గంలో 296 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను అధికారులు అందజేసి, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

● **నూజివీడు:** నూజివీడు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై. భవానీశంకరి సారథ్యంలో సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 286 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బందికి అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను ఇతర సామగ్రిని ఇచ్చి బస్సుల్లో ఆదివారం ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీని పూర్తి చేశారు. సుమారు 1700లకు పైగా సిబ్బందిని పోలింగ్ విధులకు నియమించారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్‌స్టేషన్లకు తరలించేందుకు దాదాపు 60 బస్సులను ఏర్పాటు చేశారు.

● **చాట్రాయి:** మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 51 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో తాగునీరు, టెంట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.



తిరువూరులో ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఓ మాధవి

ఎన్నికల విధులకు తరలిన సిబ్బంది..

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 234 పోలింగ్ కేంద్రాలకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి రిటర్నింగ్ అధికారి మాధవి పర్యవేక్షణలో అధికారులు ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను అందజేశారు. సోమవారం ఉదయం మాక్ పోలింగ్ అనంతరం ఓటింగ్ ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

● **ఆగిరిపల్లి:** సార్వత్రిక ఎన్నికల కోసం అధికారులు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 59 పోలింగ్ కేంద్రాల్లో 50,332 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కె.తాడేపల్లి (విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఈవీఎంలతో ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. కొత్తూరు తాడేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 246, 247, 248, 249 పోలింగ్ కేంద్రాలున్నాయి. శివారు గ్రామం (250) కొత్తూరు గ్రామ ఎలిమెంటరీ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సదుపాయాలు కల్పించామని అధికారులు తెలిపారు.

● **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండలంలో 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆర్‌ఓ సంపత్‌కుమార్ తెలిపారు. 300 మంది సిబ్బంది విధులకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

● **ముసునూరు:** మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని సహాయ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జవహర్ బాజీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలో 57 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని చెప్పారు. 411 మంది పోలింగ్ సిబ్బందితోపాటు, 80 మంది ఆంధ్రప్రదేశ్, తమిళనాడు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో 20 మంది సాయుధ దళాల సిబ్బందిని నియమించామన్నారు.



మైలవరం ఎల్‌హెచ్ స్టేడియంలో సిద్ధంగా ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు



కొత్తూరు తాడేపల్లి జెడ్పీహైస్కూల్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

ఎన్నికల సామగ్రి తరలింపు పూర్తి



ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు వచ్చిన సిబ్బంది

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. 234 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు పూర్తయిందని, 29 రూట్లు, 23 సెక్టోరల్‌గా నియోజకవర్గాన్ని విభజించి ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించామని చెప్పారు. 234 మంది ప్రిసైడింగ్ అధికారులు, 234 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు ఇతర సిబ్బందిని నియమించామన్నారు. 70 కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను కేటాయించామని, 85 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించరని, దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ముసునూరు: ప్రజలందరూ ఎన్నికలపై ఎలాంటి అపోహలు లేకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ పి.వాసు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఘర్షణలు తలెత్తకుండా నివారించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 80 మంది పోలీస్ సిబ్బంది, సమస్యాత్మక గ్రామాల్లో మరో 20 మంది సాయుధ పోలీస్ దళాలను నియమించామని చెప్పారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న దృష్ట్యా ప్రజలు ఎలాంటి అపోహలు, సంకోచం లేకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి సంపత్‌కుమార్



మైలవరం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు ఎన్నికల సామగ్రిని ఆదివారం అందజేశారు. ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులకు ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓ సంపత్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో 82 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ప్రస్తుతం 90 శాతం పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టామని వివరించారు.

విస్సన్నపేట మండలంలో 56 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

విస్సన్నపేట: మండలంలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి 56 పోలింగ్ బూత్‌లలో ఓట్లరు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

ఎన్నికల బందోబస్తుకు 400 మంది నియామకం

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 400 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 289 మంది సివిల్ పోలీసు సిబ్బంది, ఒక కంపెనీ ఆర్మ్‌డ్ రిజర్వుడు సిబ్బందితో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నట్లు తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. నియోజకవర్గంలో 85 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



నూజివీడు: అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్‌ఏ రామన్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే వాహనాల ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకుని పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై. భవానీశంకరి పాల్గొన్నారు.